క్లుప్తంగా

అమ్మవార్లకు సారె సమర్పణ



జి.కొండూరు: స్థానిక కోదండ రామాలయంలో సీతాదేవికి, అమృత లింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవికి, చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆండాలమ్మ రాజేశ్వరీదేవి అమ్మవార్లకు రామాలయ కమిటీ అధ్యక్షుడు పెదగమళ్ల నాగరాజు దంపతులు చీర, సారెను బుధవారం సమర్పించారు. ఆయా దేవాలయాల్లో స్థానిక మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన నాగరాజు, నాగరాణి దంపతులు చీర, సారె, పూలు, గాజులను అమ్మవార్లకు సమర్పించి పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పశుగణన సమర్థంగా నిర్వహించాలి

తిరువూరు: సెప్టెంబర్ ఒకటి నుంచి ప్రారంభించనున్న అఖిల భారత పశు గణనను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని పశుసంవర్థక శాఖ జిల్లా అసిసెంట్ డైరెక్టర్ సాయిగోపాల్ అన్నారు. తిరువూరు వెలుగు కార్యాలయంలో పశుగణనపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశుగణనలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సీడీఓ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, వెటర్నరీ అసిసెంట్ సర్జన్ మనోజ్ పశుగణన నమోదు చేసే విధానాన్ని వివరించారు. తిరువూరు పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్‌సింగ్, పశు వైద్యులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

గంపలగూడెం: గంపలగూడెం రామ భజన మందిరంలో జట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో గోదాదేవి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు గోదాదేవి అష్టోత్తరం, విష్ణు సహస్ర నామ పారాయణం పఠించారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి, మహిళలు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుతో రైతులకు మేలు

జి.కొండూరు: రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందవచ్చని మండల ప్రత్యేకాధికారి జి. మోహన్‌బాబు అన్నారు. వెలగలేరు గ్రామంలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావుతో కలిసి మోహన్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు వల్ల పంటల బీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోలు, పంట రుణాలు, రాయితీపై వ్యవసాయ యంత్రాలు వంటివి పొందేందుకు వీలు కలుగుతుందని వివరించారు. ఏఓ రాంకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని వినతి

విస్సన్నపేట: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, జీఓ నంబర్ 117ను రద్దుచేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ లక్ష్మీకల్యాణికి యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు.

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నిక

నూజివీడు: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికలను ఈనెల 8న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేరంట్స్ కమిటీలను ఏర్పాటు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేస్తోంది. దీనిలో భాగంగా పాఠశాలల వారీగా ఓటర్ల జాబితాలను సైతం ఆయా పాఠశాలల్లో ప్రదర్శించారు. నియోజకవర్గంలోని 268 పాఠశాలల్లో గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు.

రేపు కార్మిక, కర్షకుల నిరసన

నూజివీడు: ఈనెల 9న క్విట్ కార్పొరేట్ దినంగా పాటించనున్నట్లు ఆల్ ఇండియా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి డి. హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మండల కేంద్రాల్లో, విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో నిరసన చేపడతామన్నారు. రైతు ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మరోసారి రైతులు ఢిల్లీ కేంద్రంగా ఉద్యమాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

టెక్స్‌టైల్ ప్రింటింగ్ శిక్షణ ప్రారంభం

ఆగిరిపల్లి: చేతివృత్తులు, నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయని విజ్ఞాన్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.రామ్మూర్తి నాయుడు అన్నారు. బుధవారం తోటపల్లిలోని హీల్ సంస్థ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ ప్రింటింగ్ శిక్షణ యూనిట్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఫ్యాషన్ డిజైనింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్యాబ్రిక్ ప్రింటింగ్ వంటి రంగాలకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

పొంగుతున్న వాగులు, వంకలు

- భారీ వర్షంతో స్తంభించిన జనజీవనం
- పలు రహదార్లలో నిలిచిన రాకపోకలు
- వాముకుంట్లలో ఇళ్లల్లోకి చేరిన నీరు



తిరువూరు మండలం చౌటపల్లి- కొత్తూరు మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



గంపలగూడెం మండలం ఊటుకూరు- కొణిజెర్ల మధ్య పొంగిన వాగు



చిలుకూరు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా చేరిన ఏనుగుగడ్డ వరద నీరు

గంపలగూడెం: తిరువూరు నియోజకవర్గంలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు, ఏరుల్లో వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదార్లపై వరదనీరు పారుతోంది. కొన్ని గ్రామాల్లో వరద నీరు సక్రమంగా దిగువకు పారే అవకాశం లేకపోవడంతో రహదార్లపైనే అడుగుల ఎత్తున పారడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నియోజకవర్గంలో ప్రధాన నీటి వనరైన కట్టలేరులో గంపలగూడెం మండలం తోటమూల-వినగడప నడుమ ధ్వంసమైన వంతెన వద్ద నీరు పొంగిపొర్లుతోంది. ఏటి వద్ద రాకపోకల కోసం నిర్మించిన డైవర్షన్ రహదారిపై నాలుగు అడుగుల ఎత్తుకు పైగా నీరు పారడంతో గంపలగూడెం-విజయవాడ ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై రాకపోకలు మూడో రోజు కూడా నిలిచి పోయాయి. గంపలగూడెం మండలంలోని ఊటుకూరు-కొణిజెర్ల, నెమలి-కొణిజెర్ల, తిరువూరు మండలం చౌటపల్లి-జి.కొత్తూరు నడుమ వాగుల్లో వరదనీరు ఉధృతంగా పారడంతో ఆయా రహదార్లలో రాకపోకలు స్తంభించాయి.

వాముకుంట్లలో ఇళ్లల్లోకి వర్షం నీరు

తిరువూరు మండలం వాముకుంట్లలో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. తిరువూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో సైతం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ముంపులో పొలాలు

కట్టలేరు, నియోజకవర్గంలోని పలు వాగుల్లో ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుండటంతో పరీవాహక ప్రాంతంలో నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురయ్యాయి. పరిస్థితి ఇలాగే మరి కొన్ని రోజులు కొనసాగితే వేసిన నాట్లు కొంత నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రోజంతా చిరుజల్లులు పడుతూనే ఉంది. వరుస వర్షాల కారణంగా వరినాట్లు వేసేందుకు ఆటంకం కలుగుతోంది. ఈవర్షం వల్ల సాగుచేసిన పత్తి, వరి పైర్లకు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదని మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ తెలిపారు. గంపలగూడెం, తిరువూరు మండలాల్లోని పలు చెరువుల్లో నీరు సంవృద్ధిగా చేరడంతో జలకళ సంతరించుకొంది.

చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని గ్రామాల్లో కురిసిన అధిక వర్షాలకు పలు గ్రామాల్లోని పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. బుధవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. ఓవైపు ఏనుగుగడ్డ వాగు పొంగడం, మరోవైపు కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు చేరడంతో జూపూడి, మూలపాడు, ఇబ్రహీంపట్నం, కిలేశపురం, చిలుకూరు తదితర గ్రామాల్లో పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. చిలుకూరులో ఏనుగుగడ్డ వాగు పొంగడంతో వాగుకు ఇరువైపులా ఉన్న పత్తి, మినుము తదితర పంటలు వర్షం నీటిలో ఉన్నాయి. జూపూడి, ఇబ్రహీంపట్నం, త్రిలోచనాపురం గ్రామాల్లో వరిపైర్లు చెరువులను తలపిస్తున్నాయి. నీటిని బయటకు పంపేందుకు రైతులు పొక్లెయిన్‌లతో కాలువల్లో పూడికతీసే పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు.




తిరువూరు మండలం వాముకుంట్లలో ఇంటిలోకి చేరిన వర్షం నీరు



తిరువూరు పట్టణంలో మెయిన్ రోడ్డుపై పారుతున్న వర్షం నీరు



జూపూడిలో ముంపునకు గురైన వరిపైర్లు



ఇబ్రహీంపట్నంలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

ఏనుగుగడ్డ ఉగ్రరూపం..



జూపూడి వద్ద సప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు

ఇబ్రహీంపట్నం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అధిక వర్షాలకు ఏనుగుగడ్డ వాగులో నీటి ప్రవాహం పెరిగి పొంగి ప్రవహిస్తోంది. అధిక నీటితో చిలుకూరు గ్రామంలో వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు ఎత్తు తక్కువ ఉండటంతో రోడ్డుపైన, ఇరువైపులా నీరు చేరి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మూలపాడు, కిలేశపురం వద్ద సప్టాలపైకి వరద నీరు మోకాలి లోతులో ప్రవహించడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. జూపూడి వద్ద సప్టాపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో చిన్నలంక, పెద్దలంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆయా గ్రామాల ప్రజలు పడవను ఆశ్రయించి ప్రమాదం అంచున్న ప్రయాణిస్తున్నారు. పులిచింతల ప్రాజెక్ట్ నుంచి కృష్ణానదికి సుమారు 2.80 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముర్రుపాలు బిడ్డకు అమృతతుల్యం



కొండపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు



నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు

నూజివీడు: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అమృతతుల్యమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. నరేంద్రసింగ్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తల్లిపాలు పట్టే విషయంలో తల్లులు ఎలాంటి అపోహలు పడాల్సిన పనిలేదన్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు డి. హెలీన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. ధనలక్ష్మి, హెచ్‌వీలు టి. కుమారి, ఆర్. మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

గంపలగూడెం: గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం శివారు చిన్నకొమిర అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తల్లిపాలు శిశువులకు పట్టడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త ఉష, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

- ఇబ్రహీంపట్నం: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. కొండపల్లి, గుంటుపల్లి, జూపూడి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు జి.రమాదేవి, మాధవీలత మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరమని వివరించారు. నిమ్రా నర్సింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. డెప్యూటీ డైరెక్టర్ సయ్యద్ గులాం గౌస్, మెడికల్ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.
- ఆగిరిపల్లి: అమ్మపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఆగిరిపల్లి సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో బధవారం ర్యాలీ నిర్వహించి తల్లులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు మహోత్సవాలు



మాట్లాడుతున్న పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్

ఎ.కొండూరు: నాగపూర్‌లోని హుజూర్ హజరత్ తాజుద్దీన్ బాబా వారి ఉరుసు మహోత్సవాలు ముగిశాయని ఏఏఎంటీకే దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి అన్నారు. చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చీమలపాడు నుంచి భక్త బృందంతో కలిసి నాగపూర్ వెళ్లి అక్కడ ఉరుసు మహోత్సవాల్లో పాల్గొన్నామని చెప్పారు. వారం రోజుల పాటు అక్కడే ఉండి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి బాబా వారికి చాదర్, పూలు, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖలీల్‌బాబు, జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు ఎల్బీఆర్‌సీఈ విద్యార్థిని



మైలవరం: ఢిల్లీలో జరుగనున్న స్వాతంత్య్ర వేడుకల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థిని అడ్డగర్ల వినీల పాల్గొంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు బుధవారం తెలిపారు. వినీలను నెహ్రూ కేంద్రం విజయవాడ ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎంపిక చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి ఐదుగురు మాత్రమే ఎంపికయ్యారని, వారిలో వినీల ఒకరున్నారు. వినీలను పలువురు అభినందించారు.

జవహర్ నవోదయలో సీటు

తిరువూరు: జవహర్ నవోదయ పాఠశాలలో వాముకుంట్లకు చెందిన బండి నిఖిల్‌కు సీటు లభించింది. వాముకుంట్ల ఎలిమెంటరీ పాఠశాలలో ఐదో తరగతి పూర్తిచేసిన నిఖిల్ నవోదయ పాఠశాలలో సీటు సాధించడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రేపు ఉచిత పాస్‌పోర్ట్ మేళా

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటలకు ఉచిత పాస్‌పోర్టు మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. రవి ఒక ప్రకటనలో తెలిపారు. లియో గ్లోబల్ ఓవర్‌సీస్ వారి సౌజన్యంతో నిర్వహించే పాస్‌పోర్టు మేళాలో ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా పాస్‌పోర్టు స్లాట్ కోసం చెల్లించే రూ.1500లతో పాస్‌పోర్టు పొందవచ్చన్నారు. అభ్యర్థులు పదో తరగతి సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు స్కాన్ కాపీలతో డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని కోరారు.

సీఐ చంద్రశేఖర్ బాధ్యతల స్వీకారం



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సీఐగా ఎ. చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ ముత్యాల సత్యనారాయణ సీపీ ఆదేశాల మేరకు గవర్నర్‌పేట స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది సీఐ చంద్రశేఖర్‌కు స్వాగతం పలికి సత్కరించారు. ఎం. సత్యనారాయణకు వీడ్కోలు పలికారు.

మంచం పట్టిన పల్లెలు

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- మలేరియా, టైఫాయిడ్ లక్షణాలతో బాధితులు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



పాత కొండూరులో జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత నెల రోజులుగా అధిక వర్షాలతో గ్రామాల్లో, లోతట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తడంతో జ్వరాలబారిన పడుతున్న వారి సంఖ్య అధికమవుతోంది. తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణా లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. పట్టణంలో జ్వరపీడితుల సంఖ్య అధికంగా ఉంది. తిరువూరులో ఇటీవల జ్వరం బారిన పడిన రోగులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరగా ఇంజక్షన్ వికటించి అత్యవసర వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. తిరువూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చే రోగులకు తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర వైద్య సేవలందించడంలో అధికారులు ఉదాసీన వైఖరి అవలంభిస్తుండటంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

దోమకాటుతో పెరుగుతున్న విష జ్వరాలు

తిరువూరు మండలంలోని ఆంజనేయపురం, చిట్టేల, కాకర్ల, చౌటపల్లి, లక్ష్మీపురం, కోకిలంపాడు, రోలుపడి, మల్లేల, తిరువూరు పట్టణంలోని శివారు ప్రాంతాల్లో దోమకాటుతో విష జ్వరాల బాధితులు పెరుగుతున్నారు. ఎ. కొండూరు మండలం గొల్లమందల, గోపాలపురం, రేపూడి, ఎ.కొండూరు, కంభంపాడు, విస్సన్నపేట మండలంలోని తెల్లదేవరపల్లి, విస్సన్నపేట పట్టణాలలో కూడా జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉంది. గంపలగూడెం మండలం నెమలిలో డెంగీ జ్వరాలు ఉన్నాయని ప్రచారం జరగడంతో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుహాసిని ఆ గ్రామం వెళ్ళి విచారించి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 250 మందికి రక్త పరీక్షలు చేశారు. పలువురికి వైరల్ జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించారు. విస్సన్నపేట, తెల్లదేవరపల్లి, వేమిరెడ్డిపల్లి గ్రామాల్లో కూడా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

జ్వర పీడితులకు సత్వర వైద్యసేవలందించేందుకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పెద్దవరం గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు, తిరువూరుకు చెందిన వెంకటేశ్వరరావు కోరారు. జ్వర పీడితుల గుర్తింపునకు సర్వే నిర్వహించి సత్వర వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వాస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.

ఆగిరిపల్లి తహసీల్దార్‌గా ప్రసాద్



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి తహసీల్దార్‌గా సీఎస్‌వీ ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణాజిల్లా కంకిపాడు నుంచి బదిలీపై వచ్చిన ఆయన విధుల్లోకి చేరారు. గతంలో పౌరసరఫరాల డెప్యూటీ తహసీల్దార్‌గా నూజివీడులో ఆయన పనిచేశారు. తహసీల్దార్ ప్రసాద్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌కు అభినందన

జి.కొండూరు: జి.కొండూరు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చాట్ల వెంకటేశ్వర్లును వ్యవసాయశాఖ మండల అధికారి రాంకుమార్, సిబ్బంది బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

హైస్కూల్ హెచ్ఎం చిలుకూరి మృతి



చాట్రాయి: చిత్తపూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం చిలుకూరి దామోదరరెడ్డి (59) బుధవారం విస్సన్నపేటలోని స్వగృహంలో గుండె పోటుతో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయ నేతలు పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

13న ధాన్యం డబ్బుల కోసం ఆందోళన

ఏపీ కౌలు రైతు సంఘం నేత జమలయ్య

నూజివీడు: ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించని వ్యాపారుల నుంచి డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య తెలిపారు. నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం అమర్‌భవన్‌లో ఆయన మాట్లాడారు. అన్నవరం గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారులు మల్లూరి చంద్రశేఖర్, మల్లూరి సురేష్ నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లోని 12 గ్రామాల్లోని రైతుల వద్ద గత ఏడాది సార్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించకుండా ఊరి నుంచి వెళ్లిపోయారన్నారు. రైతులు అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై మే 25న నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 65 మంది రైతులు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పారు. ఈనెల 13న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని కోరారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి

వైఎస్సార్ సీపీ నేతలు, మండల రైతుల డిమాండ్

చాట్రాయి: తక్షణమే నాగార్జున సాగర్ జలాలను విడుదల చేయించి మండలంలోని చెరువులను నింపి పంటలను, పశువులను రక్షించాలని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పంటలకు, పశువులకు చెరువుల్లో చుక్క నీరు లేకుండా పోయిందన్నారు. నాగార్జునసాగర్‌లో నీటి మట్టం పెరిగినందున, వృథా చేయకుండా, తక్షణం మండలంలోని చాట్రాయి, తుమ్మగూడెం, ఆరుగొలనుపేట, జనార్ధనవరం, సోమవరం, కొత్తగూడెం గ్రామాల్లోని చెరువులను నింపాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ లంకా నిర్మల, నేతలు మిద్దే బాలకృష్ణ, పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహన్ రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల తర్వాతే పని సర్దుబాటు చేయాలి

నూజివీడు: ప్రస్తుతం విద్యా శాఖలో 117 జీఓ ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ వారు ఏర్పాట్లు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో జీఓ నంబర్ 117ను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ ప్రకారం జీఓను రద్దు చేయకుండా అదే జీఓ ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తోందని విమర్శించారు. గత రెండు నెలల్లో దాదాపు 20 వేల మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారని, ఈ నేపథ్యంలో ఖాళీ అయిన ఉపాధ్యాయ పోస్టులను పదోన్నతులు కల్పించి భర్తీ చేసిన తరువాత ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని కోరారు.

మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆగిరిపల్లి: మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పాటు చేసిన పోరాటం మరువలేనిదని ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లమోతు కాంచనరావు, బొబ్బర్ల సురేష్, కంబాల ప్రదీప్ అన్నారు. ఆగిరిపల్లి దళితవాడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జి. చిట్టిబాబు, జయరాజు, బీజేపీ నాయకుడు బాబురావు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఫర్నిచర్ వితరణ

తిరువూరు: తిరువూరు ప్రథమశ్రేణి గ్రంథాలయానికి దాతలు బుధవారం రూ.70 వేల విలువైన ఫర్నిచర్‌ను అందజేశారు. పట్టణానికి చెందిన నాళ్ళా రంగారావు కుమారులు సాయిబాబా, సాయిప్రసాద్, సాయి కిశోర్ ఆరు రీడింగ్ బల్లలు, వాల్ ఫ్యాన్‌లను కొనుగోలు చేసి గ్రంథాలయానికి అందజేశారు. వీటిని నాళ్ళా రంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావును గ్రంథాలయ అధికారి, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

దోమల నివారణకు ఫాగింగ్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దోమల నివారణకు కొండపల్లి మున్సిపాల్టీలోని పలు వార్డుల్లో బుధవారం రాత్రి ఫాగింగ్ చేశారు. ఇటీవలి కాలంలో వర్షాలు కురవడంతో దోమల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా ఫాగింగ్ చేస్తున్నారు.